క్లుప్తంగా

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడలో ఈ నెల 26న శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం విశేషాలంకరణలు, గోపూజ, కన్నయ్య పవళింపు సేవ, ఉట్టి మహోత్సవం, అన్నప్రసాద వితరణ, గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

కలిగిరి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభను సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు ఆదివారం తెలిపారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించి సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై చర్చించనున్నట్లు వివరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన దేవరపాటి పెంచలమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, గడ్డం విజయభాస్కర్ రెడ్డి సోదరులు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లో అన్ని విధాలా అండగా ఉంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.

ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కావలి: కావలి మండల ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం నిర్వహించారు. మండలాధ్యక్షుడిగా తటవర్తి రమేష్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా చక్రి, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అలఘునాథుని కల్యాణ మహోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి అర్చకులు శ్రీనివాసశర్మ, రామయ్యస్వామి ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు రాఖీ పండగ



ఆత్మకూరు: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఏటా శ్రావణ పౌర్ణమి నాడు రాఖీ పండుగను జరుపుకోవడం సంప్రదాయం. సోమవారం శ్రావణ పౌర్ణమి కావడంతో పట్టణంలోని మహిళలు రాఖీ పండుగను జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. తమ సోదరులకు రాఖీలను కట్టేందుకు పట్టణంలోని దుకాణాల వద్ద ఆదివారం పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తూ కనిపించారు.

బీజేపీ సమావేశం



వింజమూరు (ఉదయగిరి): స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల పదాధికారుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మండలంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం బీజేపీ అనుబంధ కమిటీలను నియమించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు, స్థానిక నేతలు దేగా మధు, తదితరులు పాల్గొన్నారు.

ప్యాక్‌హౌస్‌తో బహుళ ప్రయోజనాలు

పండ్లు, కూరగాయల నిల్వ, గ్రేడింగ్, ప్యాకింగ్‌కు సౌకర్యం

- తద్వారా ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధరలు
- ఉద్యానశాఖ ద్వారా నిర్మాణాలకు 50 శాతం రాయితీ



జలదంకి మండలం గట్టుపల్లి గ్రామంలో నిర్మించిన ప్యాక్‌హౌస్

కలిగిరి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులు నాణ్యతగా ఉంటేనే మార్కెట్లో మంచి ధరలు పలుకుతాయి. రైతులు తమ ఉత్పత్తులను శుభ్రం చేయకుండా నేరుగా తరలించడం వల్ల నాణ్యత లేక ఆశించిన ధరలు లభించడం లేదు. మరోవైపు మార్కెట్‌లో డిమాండ్ లేని సమయంలో తమ ఉత్పత్తులను ఎక్కువ రోజులు నిల్వ చేసుకోలేక పోతున్నారు. ఇలా పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌లో మెళకువలు పాటించకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఉద్యానశాఖ ద్వారా ప్యాక్ హౌస్ నిర్మాణాలను ప్రోత్సహిస్తోంది. ప్యాక్‌హౌస్ నిర్మాణాలకు ముందుకొచ్చిన రైతులకు 50 శాతం రాయితీని అందిస్తోందని వింజమూరు ఉద్యానశాఖ అధికారి షేక్ షహిల్ తెలిపారు. ప్యాక్‌హౌస్ నిర్మాణాలతో రైతులకు కలిగే బహుళ ప్రయోజనాలు..వాటిని ఎలా నిర్మించుకోవాలి..సబ్సిడీ ఎలా పొందాలి..తదితర అంశాలను ఆయన వివరించారు.

ప్రయోజనాలు ఇవీ..

- రైతులు తాము పండించిన పూలు, పండ్లు, కూరగాయలను సరైన ధర లభించేలా తాత్కాలికంగా నిల్వ ఉంచుకోవచ్చు.
- పంట ఉత్పత్తులను నేరుగా మార్కెటింగ్‌కు తరలించకుండా వాటిని శుభ్రం చేసుకోవడంతో పాటు ప్యాకింగ్, గ్రేడింగ్ చేసుకుని తీసుకెళ్లేందుకు ఎంతో సౌకర్యం కలుగుతుంది.
- పంట ఉత్పత్తుల నాణ్యత బాగుండి మార్కెట్లో మంచి ధరలు లభిస్తాయి.

నిర్మాణాలకు 50 శాతం రాయితీ

ప్రభుత్వం సూచించిన మేరకు ప్యాక్‌హౌస్ నిర్మాణానికి రూ. 4 లక్షలు ఖర్చు అవుతుంది. అందులో 50 శాతం రాయితీ అంటే రూ. 2 లక్షలను ఉద్యానశాఖ రైతులకు అందజేస్తుంది. ప్యాక్‌హౌస్ నిర్మించుకోవాలని ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఇంజినీర్ ద్వారా ప్లాన్, అంచనా, భూమి పత్రాలు, బ్యాంకు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జెరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, వంద రూపాయల బాండ్ పేపర్, నోటరీ అఫిడవిట్ అందజేయాల్సి ఉంటుంది.

నిర్మాణం ఇలా..

- 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం ఉండాలి.
- పైకప్పును జీఐ ఐరన్, సిమెంట్ రేకులు లేదా కాంక్రీట్‌తో చేపట్టాలి.
- సిమెంట్ ఫ్లోరింగ్, 8 కిటికీలు, 2 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ ఉండాలి.
- భవనానికి సాధారణ ద్వారం, మరో 8 అడుగుల షట్టర్ నిర్మించాలి.
- ప్యాక్‌హౌస్ లోపల కూరగాయలు, పండ్లను శుభ్రపరిచేందుకు మూడు నీటి తొట్టెలు, ఆరబెట్టేందుకు మూడు ఫ్యాన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- గ్రేడింగ్ టేబుళ్లు, తుకానికి 300 కేజీల ఈ–వేయింగ్ మెషీన్, ప్యాకింగ్ కోసం 250 నంబర్ ప్లాస్టిక్ క్రేట్స్ ఉండాలి.
- ఒక ఇన్‌వర్టర్, కార్యాలయం టేబుల్, నాలుగు కుర్చీలు, టార్పాలిన్ షీట్లు ఉండాలి.
- మామిడి రైతులు అయితే తప్పనిసరిగా డేశాపింగ్ యూనిట్‌ను అమర్చుకోవాలి.

రైతులకు అధిక లాభాలు



ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన పండ్లు, కూరగాయలకే అధిక ధరలు లభిస్తున్నాయి. ఎక్కువ మంది రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు నేరుగా తీసుకెళ్లి నష్టపోతున్నారు. ప్యాక్‌హౌస్ నిర్మించుకుంటే సరుకు నాణ్యంగా మారుతుంది, రైతులు తాము పండించిన పంటలనే కాకుండా ఇతర రైతుల పంటలను ప్యాక్ హౌస్‌లో ప్యాక్ చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.

– షేక్ షహిల్, ఉద్యానశాఖ అధికారి, వింజమూరు

పడమరగుడ్లదొనలో వైద్యశిబిరం



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యాధికారిణి గీతారెడ్డి

కలిగిరి: మండలంలోని పడమరగుడ్లదొనలో కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్సీకాలనీలో విషజ్వరాలు ప్రబలడంతో ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేశారు. సాధారణ జ్వరాలేనని, డెంగీ, మలేరియా కేసులు నమోదు కాలేదని డాక్టర్ తెలిపారు. చిన్నపాటి జ్వరం వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను వెంటనే సంప్రదించి తగిన చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పట్టేంత వరకు వైద్యశిబిరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

వస్త్రాల పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న గురవారెడ్డి

సీతారామపురం: పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా చిన్నాగంపల్లిలోని మహిళలకు చీరలు, పురుషులకు చొక్కాపంచెలను సర్పంచ్ మునగల రామచంద్రారెడ్డి ఆదివారం వితరణ చేశారు. మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురువారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ పోలేరమ్మ ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరి సంపదలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు. అనంతరం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల



ఎడ్ల బండ్ల ఊరేగింపు

సీతారామపురం : మండలంలోని చిన్నాగంపల్లిలో పోలేరమ్మ తిరునాళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఎడ్ల బండ్లు కట్టి మేళ తాళాలు తప్పెట్ల నడుమ ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు.. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహికంగా పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

వరికుంటపాడు: మండలంలోని కొండ్రాజుపల్లి గ్రామంలో పోలేరమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు కొత్త బుట్టల్లో పొంగలి సామగ్రిని పెట్టుకుని మేళతాళాలు, తప్పెట్ల నడుమ ఊరేగింపుగా బయలుదేరి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారికి మొక్కుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏఈ శ్రీహరి ఆదివారం తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

స్నేహపూర్వకంగా మెలగాలి



గంగిరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి: గ్రామాల్లోని ప్రజలు వివాదాలకు దూరంగా కలిసిమెలిసి ఉండాలని ఎస్సై కే ఇంద్రసేనారెడ్డి సూచించారు. మండలంలోని గానుగపెంటపల్లి, గంగిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామస్తులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన ప్రదర్శన చేపడుతున్న వైద్యారోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది

ఆత్మకూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ అస్మాతో పాటు సిబ్బంది, అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు కొవ్వొత్తులను చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విధుల్లో ఉన్న వైద్యురాలిని అత్యంత పాశవికంగా హత్య చేయడం హేయమని ఖండించారు. దోషులను వెంటనే పట్టుకుని బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఎస్‌కే సందానీ, హరికృష్ణ, ఖాజా రంతుల్లా, సాధిక్ హుస్సేన్, అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకులు రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఇసుక అక్రమార్కుల కారణంగా దెబ్బతిన్న వంతెన

ఆత్మకూరురూరల్: మండలంలో మహిమలూరు–నాగులపాడు మధ్యన బొగ్గేరుపై ఉన్న వంతెనకు ఇసుకాసురుల నుంచి ముప్పు ఏర్పడింది. ఆరేళ్ల క్రితం మహిమలూరుకు చెందిన అప్పటి డీఆర్డీఓ చైర్మన్ డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి చొరవచూపి బొగ్గేరుపై వంతెనతో పాటు మహిమలూరు వరకు సిమెంట్ రోడ్డును నిర్మింపజేశారు. ఈ మార్గంలో పది గ్రామాల ప్రజలు ఆత్మకూరు పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బొగ్గేరులోని ఇసుకను అక్రమంగా తరలించే కొందరు వంతెనను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. వంతెనపై జేసీబీలు పెట్టి పక్కనే ఉన్న ఇసుకను ట్రాక్టర్లలో నింపి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు. ఈ క్రమంలో వంతెన కొన్ని చోట్ల దెబ్బతింది. రానున్న వర్షాకాలంలో దెబ్బతిన్న వంతెన మరింతగా ధ్వంసమైతే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. సుమారు పది గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. అందువల్ల పంచాయతీ రాజ్ అధికారులు తక్షణమే స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



ధ్వజ స్తంభ ప్రతిష్ట

ఉదయగిరి: మండలంలోని కృష్ణంపల్లిలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణుల విగ్రహాలతో పాటు ధ్వజం, శిఖర కలశ ప్రతిష్ఠలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

బాబోయ్ కుక్కలు

- అల్లూరులో స్వైరవిహారం చేస్తున్న గ్రామసింహాలు
- పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు
- వీధుల్లోకి రావాలంటే హడలిపోతున్న ప్రజలు
- రాత్రి వేళల్లో ప్రమాదాల పాలవుతున్న ద్విచక్ర వాహనదారులు
- ఆరు నెలల్లో 40కిపైగా కుక్కకాటు కేసులు నమోదు



మసీదు సెంటర్ వద్ద రోడ్డుపై తిరుగుతున్న వీధి కుక్కల గుంపు

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు వీధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దిచక్ర వాహనదారులను వెంబడిస్తుండడంతో తప్పించుకునే క్రమంలో ప్రమాదాల పాలవుతున్నారు. గత ఆరు నెలల్లో 40మందికిపైగా కుక్క కాటు కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నగర పంచాయతీ పరిధిలోని మసీద్ సెంటర్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ సెంటర్, బిర్యాని సెంటర్‌లలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. హోటళ్లు, చికెన్, మటన్ సెంటర్ల వద్ద రోడ్లపై గుంపులు, గుంపులుగా సంచరిస్తూ తిరుగుతూ దాడి చేస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో తిరగాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కుక్కలు ఒకదానిపై ఒకటి దాడి చేసుకుంటూ వాహనాలకు అడ్డు వస్తుండడం..రాత్రి వేళల్లో వెంబడిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నియంత్రణను పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు

నగర పంచాయతీ పరిధిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన నగర పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వీధి కుక్కలకు సంతానం కలగకుండా చికిత్సలు చేయించడం లేదు. దీంతో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఇప్పటికైన నగర పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హడలెత్తిస్తున్నాయి



నగర పంచాయతీ పరిధిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ హడలెత్తిస్తున్నాయి. మసీద్ సెంటర్‌లోని మాంసం దుకాణాల వద్ద పెద్ద ఎత్తున ఉంటూ దాడి చేస్తున్నాయి. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

– షేక్ మసూద్, మసీద్‌సెంటర్

భయమేస్తోంది



నగర పంచాయతీ పరిధిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా దాడులు చేస్తున్నాయి. దీంతో వీధుల్లోకి రావాలంటే భయమేస్తోంది. వీధి కుక్కల సమస్య తీవ్రతరం కాకముందే నగర పంచాయతీ అధికారులు నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– షేక్ మీరా సాహెబ్, అల్లూరు

ఎరక్కపోయి ఇరుక్కున్న వానరం



కోతిని బయటకు తీసిన డాక్టర్ కుమార్

ఎరక్కపోయి ఇరుక్కుంది ఓ వానరం. తన కోతి చేష్టలను ప్రదర్శించే క్రమంలో కిటికీలో ఇరుక్కుపోయింది. అందులో నుంచి బయటకు రాలేక కేకలు వేయసాగింది. దానిని గమనించిన కొందరు బయటకు తీసేందుకు యత్నించినా కరవబోవడంతో భయపడ్డారు. మూగజీవి బాధను అర్థం చేసుకున్న డాక్టర్ కుమార్ ధైర్యం చేశారు. టవల్ సాయంతో వానరాన్ని నెమ్మదిగా బయటకు తీసి విడిచిపెట్టారు. దీంతో కోతి ఆనందంగా బయటకు పరుగులు తీసింది. చిన్న ప్రాణాన్ని కాపాడిన డాక్టర్‌ను పలువురు అభినందించారు. ఈ ఘటన పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ప్రజా వైద్యశాలలో ఆదివారం చోటు చేసుకుంది.

–ఆత్మకూరు

